# వరంగల్ వాయిస్
*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 353
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
నవంబర్ 15, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## ప్రకృతి పరిరక్షణకు పాటుపడాలి

- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సురేఖ పిలుపు
- అడువుల విశిష్టత తెలిపే అరణ్యకం బుక్ ఆవిష్కరణ



# యాగానికి వేళాయె..

## అందరూ ఆహ్వానితులే

వివరాలు2లో..

- సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రత మహా యాగానికి సర్వం సిద్ధం
- హనుమకొండ జిల్లా దామెర మండలంలో ఆదివారం నిర్వహణ
- 12 వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో కార్యక్రమాలు
- అధిక సంఖ్యలో పాల్గొనాలంటూ పిలుపు





శ్రీ వేణుదత్త సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రత మహా యాగానికి సర్వం సిద్ధమైంది. హనుమకొండ జిల్లా దామెర మండలం అమృత వాలిలో భారతదేశ యోగి వర్యులు, దత్త అవధూత భగవాన్ శ్రీ రామదూత స్వామి ఆశీస్సులతో.. `జరుగుతున్న దాంపత్య వ్రత మహాయాగ ప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. 12వేల మంది భక్తులు పాల్గొని యాగం నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. విశాలమైన వేదిక, వాహనాల కోసం పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. లోక కళ్యాణార్థం జరిగే ఈ యాగంలో పాల్గొనే వారందరికీ ఉచిత ప్రవేశంతో పాటు దంపతులకు పూజా సామాగ్రిని కూడా ఉచితంగానే అందచేయనున్నారు. కార్యక్రమానంతరం మహా అన్నదానం నిర్వహించనున్నారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం వరకు కన్నుల పండువలా జరిగే ఈ మహా యజ్ఞాన్ని మేడిశెట్టి వినయ్ కుమార్, కడారి నవనీత రావు, గడ్డం భాస్కర్, డాక్టర్ రాము, దామెరుపుల శంకర్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు. దాంపత్య వ్రత మహాయాగం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భగవాన్ కృపకు పాత్రులు కావాలని మధుసూదనాచారి పిలుపునిచ్చారు. - వరంగల్ వాయిస్, దామెర




8లో..

## వయోవృద్ధులను గౌరవిద్దాం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

## ఏవీవీలో భాగవత పద్య పఠన పోటీలు

- వీనుల విందుగా సాగిన కార్యక్రమం
- పాల్గొన్న 1,600 విద్యార్థులు



8లో..



2లో..

## అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన













# యాగానికి వేళాయె..

## అందరూ ఆహ్వానితులే

- **సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రత మహా యాగానికి సర్వం సిద్ధం**
- **హనుమకొండ జిల్లా దామెర మండలంలో ఆదివారం నిర్వహణ**
- **12 వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు**
- **ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో కార్యక్రమాలు**
- **భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలంటూ పిలుపు**

**వరంగల్ వాయిస్, దామెర :** కలియుగంలో ప్రతి ఒక్కరూ అనేక రకాల అనారోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు, దాంపత్య జీవిత సమస్యలు, సంతాన లేమి సమస్యలు, ఇతర అనేక సమస్యలతో సతమతవుతున్నారు. ఇలాంటి అనేక సమస్యల పరిష్కారానికే సువర్ణలక్ష్మీ దాంపత్య వ్రత మహాయాగం ఏర్పాటు చేసినట్లు శాసనమండలి విపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ప్రకటించారు. ఆదివారం ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీ వేణుదత్త సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రత మహా యాగానికి అన్నీ తానై వ్యవహరిస్తున్న సిరికొండ శనివారం విలేఖరులతో మాట్లాడారు. విలేకరుల సమావేశంలో మేడిశెట్టి వినయ్, గోపాలకృష్ణ గోఖలే, టి.హరీష్, కుమారస్వామి, లక్ష్మణ్ రామ, డాక్టర్ రాము, దాడి మల్లయ్య, దామెరుప్పుల శంకర్, లెంకాల రాజిరెడ్డి, గోపు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత ప్రవేశం..**

లోక కళ్యాణార్థం భారతదేశ యోగి వర్యులు, దత్త అవధూత భగవాన్ శ్రీ రామదూత స్వామి ఆశీస్సులతో నిర్వహిస్తున్న సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రత మహా యాగంలో పాల్గొనేందుకు ఉచిత ప్రవేశం కల్పించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. అదే విధంగా పూజా సామాగ్రిని ఉత్సవ వాటికయందు ఉచితంగా అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎటువంటి నియమ, నిబంధనలు లేవన్నారు. జాతి, కుల, మత బేదాలు లేవన్నారు. ధనిక, పేద తారతమ్యం లేదన్నారు. నిర్మలమైన మనసు, పరిపూర్ణ భక్తి విశ్వాసాలు ఉన్న ప్రతి ఒక్కరు ఈ యాగంలో పాల్గొనవచ్చన్నారు. మహా యాగంలో పాల్గొన్న వారందరికీ భగవాన్ శ్రీ రామదూత స్వామి అనుగ్రహభాషణం ద్వారా ఆశీర్వచనం లభించనున్నట్లు వెల్లడించారు. ఈ మహాయజ్ఞ ఫలాన్ని దంపతులు అందుకొని అనేక శుభాలు పొందాలన్నారు. మీ మనో సంకల్పాలను నెరవేర్చుకొని శుభములను పొందేందుకు ఇది ఒక చక్కని అవకాశం అన్నారు.

**భారీ ఏర్పాట్లు..**

హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని అమృత వాలీలో నిర్వహించనున్న ఈ యాగానికి సర్వం సిద్ధం చేశారు. 12 వేల మంది పాల్గొనేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. విశాలమైన వేదిక, వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. కనీ, వినీ ఎరుగని రీతిలో సభా వేధికను సిద్ధం చేస్తున్నారు. ఇందుకు గాను గత వారం రోజులుగా నిర్వాహకులు శ్రమిస్తున్నారు. ఈ మహా యజ్ఞాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సిరికొండ మధుసూదనాచారితోపాటు మేడిశెట్టి వినయ్ కుమార్, కడారి నవనీత రావు, గడ్డం భాస్కర్, డాక్టర్ రాము, దామెరుపుల శంకర్ తదితరులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఇప్పటికే పోలీస్, విద్యుత్, అగ్నిమాపకం, మెడికల్, ల్యాండ్ ఓనర్ అనుమతులతోపాటు స్టేజీ ఫిట్నెస్ సర్టిఫికెట్ సైతం తీసుకున్నారు.



# అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. శనివారం నగర పరిధిలోని ఉనికిచర్ల, మడికొండ, తరాలపల్లి, సిద్దార్థ నగర్ ప్రాంతాల్లో పూర్తి అయిన అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్ధవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని 46 వ డివిజన్ ఉనికిచర్ల ప్రాంతంలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారితో పాటు శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన బర్నింగ్ ప్లాట్ ఫాం, నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బోర్, ప్రహరీ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. అదే విధంగా 64 వ డివిజన్ మడికొండ ప్రాంతంలో పలు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవి కుమార్, డీఈ రవి కిరణ్, ఏఈ రామన్న, వర్క్ ఇన్ స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణకు పాటుపడాలి

- **అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సురేఖ పిలుపు**
- **అడువుల విశిష్టత తెలిపే అరణ్యకం బుక్ ఆవిష్కరణ**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ప్రకృతి పరిరక్షణకు అందరూ పాటుపడాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో అడువుల విశిష్టతను తెలిపే అరణ్యకం పుస్తకాన్ని మంత్రి సురేఖ ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఫారెస్టు ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, అటవీ శాఖ ఉన్నతాధికారులు అడిషనల్ పీసీసీఎఫ్ సునీత భగవత్, సోషల్ ఫారెస్టు బాధ్యులు రామలింగం, చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టు ప్రియాంక వర్గీస్, సీసీఎఫ్ బీమానాయక్ తదితరులు పాల్గొన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అడవులు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు తన వంతుగా ఏదైనా చేయాలని, పుస్తకం రాసి తన చుట్టూ వాళ్ళకు అవగాహన కల్పించాలని కృష్ణారావు చూశారన్నారు. పచ్చని అడవులు ఉంటేనే పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు కలకాలం పచ్చగా, ఆనందంగా జీవిస్తారని చెప్పారు. అందుకు కృషి చేసిన కృష్ణారావును మంత్రి సురేఖ అభినందించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత చేకూరి కృష్ణారావు కెనడా నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈ పుస్తకావిష్కరణలో పాల్గొన్నారు. అయితే, ఈ పుస్తక రచనలో పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ కూడా పాలుపంచుకున్నారని రచయిత చెప్పారు. పుస్తకం ప్రింట్ అయ్యేవరకు ఆమె తనకు అన్ని విధాల సహాయం అందించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కూడా ఫారెస్టు డిపార్టుమెంటులో ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగంలో చేరి చాలా ఏండ్లు సేవలు అందించినట్టు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కెనడా ప్రభుత్వంలో సేవలు అందిస్తున్నట్టు వివరించారు. ఈ పుస్తకం ద్వారా వాతావరణ సవాళ్ళు – హరిత మార్గాలు ప్రధానంగా చర్చించినట్టు వివరించారు. భవిష్యత్‌లో భూమి ఎంత వేడిగా ఉంటుందో తెలుసా? క్లైమేట్ జస్టిస్, సహజ వనరుల కొరతకు కారణం, జీవ వైవిధ్య సంరక్షణ, ప్రకృతి ఆధారిత పరిష్కారాలు, సాంకేతిక ఇటీవలి పోకడలు, సామాజిక మాధ్యమాలలో ప్రకృతి కథలు తదితర అంశాలపై తాను ఈ పుస్తకంలో పూర్తి వివరాలు ఇచ్చినట్టు వెల్లడించారు. కాగా, రచయిత కృష్ణారావు, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ ప్రయత్నాలను మంత్రి సురేఖ ప్రత్యేకంగా అభినందించారు.

# వరి కోత, ధాన్యం కొనుగోలుపై సమీక్ష

■ రైతులకు కీలక సూచనలు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి కోత యజమానులకు ధాన్యం కోత, కొనుగోలు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన నీడ సౌకర్యం, ఎలక్ట్రానిక్ తూకం మెషీన్, తాగునీరు, టార్పాలిన్‌లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఐలయ్య వరి కోత యజమానులకు, రైతు సోదరులకు కీలకమైన సాంకేతిక సూచనలు చేశారు. నాణ్యమైన ధాన్యం (తాలు లేకుండా) వచ్చేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. బ్లోయర్ తప్పనిసరిగా ఆన్‌లో ఉండాలి. మెషీన్ ఆర్ పీఎం (రౌండ్లు పర్ మినిట్) 18 నుంచి 20 మధ్య ఉండాలి. గేర్ పొజిషన్ 'A' మోడ్ నుంచి 'B1'కు ఉండే విధంగా వరి కోతలు చేయాలి. ధాన్యం ధరలు, బోనస్ వివరాలుప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో A గ్రేడ్ వరి క్వింటాల్‌కు రూ. 2,389, కామన్ రకం క్వింటాల్‌కు రూ. 2,369 చొప్పున ధర ఉంటుందని, అలాగే సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందించడం జరుగుతుందని రైతులకు వివరించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని, తేమ శాతం 17 లోపు ఉన్న వాటిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఘనపురం చైర్మన్ కన్నెబోయిన కుమార్, మండల ఎస్ఐ అశోక్, వ్యవసాయ విస్తరణ అధికారులు పవన్ కళ్యాణ్, కళ్యాణ్, అమూల్య, పీఏసీఎస్ ఘనపురం సొసైటీ సీఈఓ సురేష్, రవీందర్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** కాశీబుగ్గ 20వ డివిజన్‌లోని ప్రముఖ రంగనాయక స్వామి దేవాలయంలో కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక దాతలు పూర్తి సహకారాన్ని అందించారు. ఈ మహా అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, శ్రీవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో రంగనాథ స్వామి దేవాలయం మాజీ అధ్యక్షులు ఎన్.వెంకట్రావు, వంగరి రవి, మొటం శ్రీనివాస్, వేముల నాగరాజ్, ఆరే రమేష్, కూరపాటి రోజా, కోలా కవిత, మంచాల సృజన, గడ్డం భాస్కర్, బైరి రాముడు, పిట్టల కోటేశ్వర్, పల్లకొండ కోటి, సాగర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని, సేవలను అందించారు.

# లారీ పై నుంచి పడి డ్రైవర్ మృతి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** వరి, ఇతర సరుకులను రవాణా చేసే లారీ డ్రైవర్, యజమాని అయిన ఒక వ్యక్తి లారీపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పర్వతగిరిలో జరిగింది. వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన మల్లేశం (55) లారీ నెంబర్ ఏపీ 29 టీఏ 9457లో ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు ఏనుగల్లులోని మారుతి రైస్ మిల్ నుంచి బియ్యం లోడ్ చేసుకొని, అదే రోజు సాయంత్రం 4:30 గంటలకు పర్వతగిరిలోని ఏఎంసీ మార్కెట్ యార్డ్‌కు చేరుకున్నారు. 15 వ తేదీ ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి తిరిగి మార్కెట్ యార్డ్‌కు వచ్చి, లారీపై ఉన్న టార్పాలిన్ కవర్‌ను విప్పి, మడతపెట్టి, క్యాబిన్ పైన పెట్టే క్రమంలో సుమారు 12 గంటల సమయంలో ప్రమాదవశాత్తు లారీ పై నుంచి కిందపడ్డారు. దీంతో మల్లేశం తలకు బలమైన గాయమై, చెవులు, ముక్కు నుంచి రక్తం కారి అక్కడికక్కడే మరణించారు. మృతుడి భార్య ఎగ్గె లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# పేద విద్యార్థులకు జీఆర్ కే ఫౌండేషన్ అండ

## 528 మందికి పరీక్ష ఫీజు చెల్లింపు



**వరంగల్ వాయిస్, శివనగర్:** వరంగల్ నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద పదో తరగతి విద్యార్థులకు జీఆర్కే (గంట రవికుమార్) ఫౌండేషన్ భారీ చేయూతనిచ్చింది. నగరంలోని 14 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మొత్తం 528 మంది పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును ఫౌండేషన్ చెల్లించింది. పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో, విద్యార్థులకు అండగా నిలిచేందుకు జీఆర్కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంట రవికుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. చదువుకు పేదరికం అడ్డుకారాదని రవికుమార్ గారు ఆకాంక్షించారని, నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ఫౌండేషన్ తనవంతు సహకారం ఎప్పుడూ అందిస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఫీజు చెల్లింపుకు సంబంధించిన చెక్కులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. అదేవిధంగా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డిసెంబర్ 1వ తేదీ నుండి 8వ, 9వ, 10వ తరగతులు చదివే పేద మరియు ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత ట్యూషన్‌లకు కూడా శ్రీకారం చుట్టినట్టు జీఆర్కే ఫౌండేషన్ సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్ రఫీ, కందుకూరి విజయ్ కుమార్, సామల శ్రీనివాస్, కాళీ రాజు, పొడాల సురేష్, పోశాల సతీష్, శరత్, శివ, సందీప్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కార్తీక వనభోజనాలకు చేనేత కార్మికులను ఆహ్వానించిన చిప్ప వెంకటేశ్వర్లు నేత



**వరంగల్ వాయిస్, కొత్తవాడ :** వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని చిప్ప వెంకటేశ్వర్లు నేత చేనేత కార్మికులను, పద్మశాలి కుల బంధువులను కోరారు. ఈ సందర్భంగా శనివారం కొత్తవాడలోని చేనేత సహకార సంఘంలో కల పత్రాలను (ఆహ్వాన పత్రాలను) పంపిణీ చేయడం జరిగింది. ఖిలా వరంగల్ కోటలోని వాకింగ్ మైదానంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వరంగల్ జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్, క్యాతం శ్రీనివాస్, చెలుమల్ల విజయలక్ష్మి, దుస్సా సుగుణ, రజిత, వెల్దండి లక్ష్మి, రాజేశ్వరి, బూర్ల సరోజన, పేర్న లత, పోత్తబత్తిని మొగిలి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రతిష్ఠాపన వేడుకలు



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాపన మరియు కుంభాభిషేక మహోత్సవాలు రెండవ రోజు శనివారం ఘనంగా కొనసాగాయి. ఆలయ ప్రాంగణం శివనామస్మరణలతో, హరినామ గోషాలతో మారుమ్రోగింది. వేదపండితుల వేదఘోషల మధ్య ఘనమైన హోమాలను నిర్వహించారు. తెల్లవారుజామునే వేదపండితులు మంగళవాద్య నాదాలతో నిత్య హోమాదులను ప్రారంభించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులకు అష్టోత్తర శతకలశ కుంభాభిషేకం నిర్వహించగా, విగ్రహమూర్తులకు ధాన్యసేనాది వాసం వేడుక ఎంతో వైభవంగా జరిగింది. సహస్ర లింగార్చన ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై, ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 6 గంటలకు గణపతి, శివలింగ, నవగ్రహ, అష్టబలిపీఠ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆడపడుచులందరూ తమ ఇళ్ల వద్ద నుండి మంగళహారతులతో నడకబాటలోని దేవాలయానికి విచ్చేసి, స్వామి దరహాసనానికి హారతులు అందించాలని కోరారు. ఆలయం చుట్టుపక్కల విద్యుత్ దీపాల అలంకరణతో కనువిందు చేస్తోంది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల రాకపోకలకు, సకల ఏర్పాట్లకు వాలంటీర్లు కృషి చేస్తున్నారు.

# కాకతీయ జూ పార్కులో వింటర్ కేర్ ఏర్పాటు చేయాలి

## బీఆర్ఎస్ నాయకులు రావుల వెంకట రమేష్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని హంటర్ రోడ్డు కాకతీయ జూ పార్కులో చలికాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే వింటర్ కేర్‌ను ఏర్పాటు చేయాలని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు రావుల వెంకట రమేష్ గౌడ్ జిల్లా ఉన్నత అధికారులను విజ్ఞప్తి చేశారు. చలి ప్రభావంతో పార్కులోని పులులు, జింకలు, ఇతర జంతువులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న ఇన్‌క్లోజర్‌లను అధికారులు ఇప్పటివరకు సరి చేయకపోవడం వలన గ్రీన్ మ్యాట్‌లు సైతం చిరిగిపోయాయని తెలిపారు. అంతేకాకుండా, మొసళ్లకు అవసరమైన ఇసుక కూడా వర్షాల వల్ల కొట్టుకుపోయిందని ఆయన పేర్కొన్నారు. మొత్తం 419 మూగ జీవాలు ఉన్న కాకతీయ జూ పార్కులో జంతువుల సంరక్షణకు అత్యవసరంగా వింటర్ కేర్‌ను ఏర్పాటు చేయాలని వెంకట రమేష్ గౌడ్ అధికారులను కోరారు.

# నిషేధిత గుట్కా పట్టివేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిషేధిత గుట్కా ప్యాకెట్లను మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న ఒక నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నిందితుడు మిర్జా సరీముల్లాహ్ బేగ్ తన యాక్టీవా మోటార్ సైకిల్‌పై నిషేధిత గుట్కా ప్యాకెట్లను తరలిస్తుండగా, హనుమకొండ ఎస్సై కిషోర్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు రూ. 13 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ మచ్చ శివ కుమార్ వెల్లడించారు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా బత్తిని శివశంకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, గణపురం:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తిని శివశంకర్ గౌడ్ నియమితులయ్యారు. బీసీ ఉద్యమ బలోపేతానికి, జిల్లాలో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పదవి దక్కింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బట్టి శ్యామ్ యాదవ్ ఈ నియామకాన్ని ప్రకటించారు. గతంలో శివశంకర్ గౌడ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఘన్‌పూర్ మండల అధ్యక్షుడిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా సేవలందించారు. అంతేకాకుండా, కల్లు గీత కార్మిక సంఘం జయశంకర్ జిల్లా అధ్యక్షుడిగా కూడా ఆయన పనిచేశారు.

# కార్తీక వనభోజనాలకు తరలిరండి

## పోపా అధ్యక్షులు శ్రీనివాస్ పిలుపు



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్:** కార్తీక మాసం సందర్భంగా నిర్వహించే పద్మశాలి వనభోజనాలకు పద్మశాలి కుల బంధువులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని పోపా (పద్మశాలి ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ వనభోజన కార్యక్రమాన్ని వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఈ నెల 16, ఆదివారం ఉదయం 9 గంటలకు మార్కండేయ పూజతో ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. వరంగల్ నగరంలో గత ఏడు సంవత్సరాల నుంచి పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, దీని ద్వారా పద్మశాలీలలో ఐకమత్యాన్ని పెంపొందిస్తున్నామని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి చేనేతలు, సంఘ సభ్యులు, డాక్టర్లు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** మండల కేంద్రంలోని బృందావన గార్డెన్స్‌లో ముత్తారం గ్రామ మాజీ ఎంపీటీసీ మానస భాస్కర్ చెల్లెలి వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని, వారి జీవితాల్లో సువర్ణయుగం మొదలుకావాలని ఆకాంక్షిస్తూ వారిని ఆశీర్వదించారు. ఈ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని, వరుడు-వధువులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

## ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కాలేజ్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. దీనిపై అవగాహన కల్పించి, అటువంటి సంఘటనలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ అందించే సేవలు, వాటిని ఎలా వినియోగించుకోవాలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మహిళల స్వీయ రక్షణ మరియు చట్టపరమైన హక్కుల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల గురించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, అలాగే సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 గురించి వివరించారు. ఇన్‌స్పెక్టర్ శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లు, ఇతర విషయాలపై దృష్టి పెట్టకుండా, తమ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. తమ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకొని, తోటి వారికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉమెన్ ఏఎస్సై కమల, హెడ్ కానిస్టేబుల్ మంజుల, బ్లూకోల్ట్స్ టీమ్ నాయక్, కుమార్, సైబర్ వారియర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలు బలోపేతం కావాలి

## ◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రభుత్వ సహకార సంఘాలను మరింత బలోపేతం చేసుకోవాలని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సహకార వ్యవస్థ ద్వారానే వ్యవసాయ రంగం అభివృద్ధి చెంది, రైతులు గౌరవంగా జీవించగలరని ఆయన అభిప్రాయపడ్డారు. ఆత్మకూరు మండలం పెంచికలపేట పీఏసీఎస్ (ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీ) ఆధ్వర్యంలో నీరుకుళ్ల గ్రామంలోని కందిబండ వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఫర్టిలైజర్ గోదాం, డ్రై షెడ్ కార్యాలయమునకు భూమి పూజ చేశారు. అలాగే, పీఏసీఎస్ చైర్మన్ శ్రీ కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 72వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా, నీరుకుళ్లలో నిర్మించిన పీఏసీఎస్ పెంచికలపేట నూతన భవనాన్ని టీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార వ్యవస్థ అనేది మనకు మనం అభివృద్ధి చేసుకునే వ్యవస్థ అని, వ్యవసాయ రంగానికి ఇది చాలా అవసరం అన్నారు. సహకార వ్యవస్థ ద్వారానే దేశ ఆర్థిక పరిస్థితికి ఆధారమైన వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధ్యమని తెలిపారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, బ్యాంకింగ్ తదితర సేవలు సహకార సంఘాలు అందిస్తున్నాయని కొనియాడారు. డ్వాక్రా గ్రూపులను ప్రోత్సహించి, మహిళా బ్యాంకులు, మహిళా సాధికారత లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పరకాల మహిళా డైరీ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతు కుటుంబాలు గౌరవంగా ఉండాలంటే, సహకార సంఘాలు బలోపేతం కావాలని సూచించారు.రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాగు విధానం వంటి సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. సకాలంలో నూతన పీఏసీఎస్ భవనాన్ని పూర్తిచేసిన పాలకవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. అభివృద్ధిలో రాజకీయాలు వద్దు అని, పనిచేసే వారికి రాజకీయాలకు అతీతంగా ప్రోత్సహిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ సంజీవరెడ్డి, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్ పాల్గొన్నారు.

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** స్థానిక వేణురావు కాలనీ పోచమ్మ మైదాన్‌లో ఉన్న పవన్ సాయి పబ్లిక్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధనను కొనసాగించారు. అలాగే, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ కనుకుట్ల రంజిత్ కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చెన్నూరి అనిల్ కుమార్ మాట్లాడుతూ, తమ పాఠశాల విద్యార్థులను అత్యున్నత స్థానంలో నిలపడానికి పవన్ సాయి పబ్లిక్ స్కూల్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 17న కుంకుమేశ్వర ఆలయంలో మహా రుద్ర యాగం

## వేలాది భక్తులకు భోజన సదుపాయం



**వరంగల్ వాయిస్, పరకాల :** కార్తీక మాసం సందర్భంగా కుంకుమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న మహా రుద్ర యాగంకు వచ్చే వేలాది మంది భక్తులకు ఇనుగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భోజన సదుపాయం కల్పించనున్నారు. సోమవారం ఈ మహా రుద్ర యాగం నిర్వహించబడుతోంది. ఈ భోజన సదుపాయ ఏర్పాటు కార్యక్రమంలో కుంకుమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్, మహా రుద్ర యాగ సమితి అధ్యక్షులు ఎర్ర లక్ష్మణ్, యాగ సమితి కన్వీనర్ గందె రవి, కో-కన్వీనర్ ఆముదలపల్లి అశోక్, మహా రుద్ర యాగ సమితి కోశాధికారి తోట భద్రయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్ కందుకూరు శ్రీధర్, పిట్ట వీరస్వామి, శివారపు రాజు, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ పటేల్ అడుగుజాడల్లో పయనించాలి

## ◆ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** నవభారత నిర్మాణం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ఆయన అడుగుజాడలలో ప్రతి ఒక్కరు పయనించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని, శనివారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ ఆవరణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ వరంగల్ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సర్దార్ వల్లభాయ్ పటేల్, భరతమాత చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం, ఐక్యత పాదయాత్రను ('యూనిటీ మార్చ్ 2025') జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో స్వేచ్ఛ కోసం తపించిన వ్యక్తి సర్దార్ పటేల్ అని పేర్కొన్నారు. ఎన్ని భాషలు మాట్లాడినా, ఎన్ని ప్రాంతాలు ఉన్నా మనమందరం ఒకటేనని ఆయన చాటి చెప్పేవారని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటి చేయడంలో సర్దార్ పటేల్ కృషి చరిత్రాత్మకమైనది అన్నారు. భారత దేశ ప్రజల్ని చైతన్యపరిచి, ఏకతాటిపై నడిపించిన మహనీయుడని కొనియాడారు. కలెక్టర్... ప్రజలు ఆయన ఆశయ సాధన కోసం పని చేయాలని కోరారు. భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడానికి ప్రతి పౌరుడు దేశీయ ఉత్పత్తులను ఉపయోగించుకోవాలని, దేశానికి సహకరించాలని కోరుతూ, ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిచే ఐక్యత (ఆత్మనిర్భర భారత్) ప్రతిజ్ఞ చేయించారు. మేరా యువ భారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ మాట్లాడుతూ... యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'యూనిటీ మార్చ్ 2025' అనేది సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమం అని తెలిపారు. ఈ మార్చ్, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని జరుపుకుంటూ దేశ ఐక్యతను చాటి చెబుతుందని, దీనిలో భాగంగానే జనగామ జిల్లా కేంద్రంలో ఈ రోజు నిర్వహించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీఓ గోపీరామ్, ఎమ్మార్వో హుస్సేన్, మేరా యువ భారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, మేరా భారత్ జనగామ వాలంటీర్ హరీష్, నామినేటెడ్ సభ్యులు, మై భారత్ వాలంటీర్లు, ఎన్.ఎస్.ఎస్./ఎన్.సి.సి. వాలంటీర్లు, మహిళా సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సుమారు 1000 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానానికి నిలయం గ్రంథాలయం

◆ కొత్తపల్లి గోరిలో నూతన గ్రంథాలయం ప్రారంభం

**వరంగల్ వాయిస్, రేగొండ :** గ్రంథాలయాలు విజ్ఞానానికి తరగని గనుల వంటివని, వాటి అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఉమ్మడి రేగొండ, కొత్తపల్లి గోరి మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన నూతన పౌర పఠన గ్రంథాలయాన్ని ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ సమాజంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో ముఖ్యం అన్నారు. ప్రభుత్వం నిర్వహించే అన్ని పోటీ పరీక్షలకు గ్రంథాలయంలోని పుస్తకాలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ నూతన గ్రంథాలయాన్ని రూ. 10 లక్షలతో అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. అదనంగా, పాఠ్యపుస్తకాల కొనుగోలుకు రూ.2 లక్షలు నిధులు ఇస్తామని



తెలిపారు. అనంతరం జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ రాజబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకోవాలన్నారు. గ్రంథాలయంలో దినపత్రికలతో పాటు విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు లభిస్తాయని, వాటిని ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కొడవటంచ ఆలయ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, జిల్లా నాయకులు సూరం వీరేందర్, మండల నాయకులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, అధికారులు, అభిమానులు, సుమారు 20 మంది ప్రముఖులు పాల్గొన్నారు.

# బిర్సా ముండా ఆశయాలను కొనసాగిద్దాం

● సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పిలుపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత ఆదివాసీ పోరాట చరిత్రలో గొప్ప స్ఫూర్తిని రగిలించిన బిర్సా ముండా ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. శనివారం హనుమకొండ బస్టాండ్ వద్ద ఆదివాసీ పోరాట యోధుడు బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తరతరాలుగా అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీ ప్రజానీకం, వారు ఆధారపడ్డ భూమిని, వనరులను కాపాడుకోవడం కోసం ఆంగ్లేయులకు, ఇతర దోపిడీదారులకు వ్యతిరేకంగా బిర్సా ముండా సమరశీల పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. 25 సంవత్సరాల వయసులోనే బ్రిటిష్ వలస దోపిడీదారులను గడగడలాడించిన బీర్సా ముండా పోరాట ఫలితంగానే ఆదివాసీ భూములను ఇతరులకు బదిలీ చేయకూడదని చట్టం వచ్చిందని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలపై కక్ష కట్టిందని ఆయన ఆరోపించారు. ఒకవైపు ఆదివాసీలను 'ఘర్ వాపసి' పేరుతో బీజేపీలో చేర్చుకొని, మరోవైపు వారు తరతరాలుగా కాపాడుతున్న సహజ వనరులు, ఖనిజాలు, అటవీ ఉత్పత్తుల సంపదను అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు అప్పజెప్తోందని




విమర్శించారు. వారి దోపిడీకి ఇబ్బందులు కలగకుండా చూసేందుకే ఆపరేషన్ కగార్ అమలు జరుగుతోందని ఆరోపించారు. నక్సలిజాన్ని, ఆదివాసీలను నిర్మూలించడం ఎవరి తరం కాదని ఆయన అన్నారు. బిర్సా ముండా, కొమురం భీమ్, అల్లూరి తదితరులు నిర్వహించిన ఆదివాసీ పోరాటాల స్ఫూర్తితో భారతదేశ సర్వసంపదలను కాపాడటానికి వర్గ పోరాటాలలో ప్రజలు, ముఖ్యంగా యువతరం పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ డివిజన్ సహాయ కార్యదర్శి అర్షం అశోక్, డివిజన్ నాయకులు మైదం పాణి, సాబిరీకాని మోహన్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావుతో పాటుగా వెంకన్న, ప్రసాదు, మహేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పోస్టుమాస్టర్‌పై ఫోర్జరీ ఆరోపణలు

◆ ఎల్ఐసీ బాండ్ ఇవ్వకుండానే రిసీవ్డ్ చేసిన వైనం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్‌పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. స్థానిక పోస్టుమాస్టర్ సారంగపాణి, ఒక లబ్ధిదారుడికి ఎల్ఐసీ బాండ్‌ను అందించకుండానే, బాండ్‌ను ఇచ్చినట్టుగా రికార్డుల్లో ఫోర్జరీ చేశారని ఫిర్యాదు అందింది. బాధితుడు షేక్ ఇమ్రాన్ తండ్రి మైబెల్లి ఈ విషయంపై వరంగల్ పోస్టల్ సూపరింటెండెంట్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. షేక్ ఇమ్రాన్‌కు గత నెలలో రిజిస్టర్ పోస్టులో




ఎల్ఐసీ బాండ్ వచ్చింది. అయితే, పోస్టుమాస్టర్ సారంగపాణి ఆ బాండ్‌ను ఇమ్రాన్‌కు ఇవ్వకుండానే, ఇచ్చినట్టుగా ఆఫీసు రికార్డుల్లో సంతకాన్ని ఫోర్జరీ చేసి (రిసీవ్డ్ చేసినట్లు) సబ్మిట్ చేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఇమ్రాన్ ఎల్ ఐసీ కార్యాలయం, పోస్టల్ ఆఫీస్‌కు వెళ్లి అడగగా, "మీకు బాండ్ పంపించాము, నీకు ముట్టినట్లు మా వద్ద రిసీవ్డ్ ఉంది" అని చెప్పడంతో ఆశ్చర్యపోయినట్లు మైబెల్లి తెలిపారు. గ్రామంలోని పింఛన్‌దారుల వద్ద పోస్టుమాస్టర్ ప్రతి నెల ఆర్. డి. (రికరింగ్ డిపాజిట్) పేరుమీద ఒక్కొక్కరి వద్ద రూ.500 నుంచి రూ.1000 వరకు తీసుకుని పాస్‌బుక్‌లో రాయడం లేదని, వారికి డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని మైబెల్లి ఆరోపించారు. పింఛన్ ఇచ్చే క్రమంలో ప్రతి ఒక్కరికీ



రూ.16 చిల్లర ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఉన్నతాధికారులకు ఫిర్యాదు..


ఈ విషయమై పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు అతనిపై ఎటువంటి ఎంక్వయిరీ చేయడం లేదని, ఇమ్రాన్‌కు బాండు సైతం ఇవ్వలేదని మైబెల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై హైదరాబాద్‌లోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించనున్నట్లు ఆయన తెలిపారు.

# బాల్య వివాహాల నిరోధంపై అవగాహన



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి భిక్షపతి అధ్యక్షతన గ్రామ స్థాయి బాల్య వివాహాల నిరోధక, నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత హాజరయ్యారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాల గురించి ప్రస్తావిస్తూ, ఆపదలో ఉన్న మహిళలు తక్షణ సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 181 కు కాల్ చేయాలని పిలుపునిచ్చారు. టీసీపీఎస్ బాలల సమగ్ర విభాగం నుంచి వచ్చిన సుజాత దేవి మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాల వయసుగల బాలబాలికలకు ఆపద కాలంలో, తల్లిదండ్రులు లేని పిల్లలకు మిషన్ వాత్సల్య ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉందని తెలిపారు. అక్రమ దత్తత, చైల్డ్ లేబర్ తదితర సమస్యల గురించి ఫిర్యాదు చేయడానికి 1098కు డయల్ చేయాలని సూచించారు. అదేవిధంగా, మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ప్రత్యేకంగా అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కళావతి, సంపూర్ణ, అనిత, వినోద, జడ్పీఎస్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కరీమాబాద్ హైస్కూల్‌లో శ్రమదానం




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఇచ్చిన పిలుపు మేరకు, పరిశుభ్రత, పచ్చదనం పెంపు లక్ష్యంగా శనివారం కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'స్వచ్ఛత పాఠశాల' కార్యక్రమం విజయవంతంగా జరిగింది. డివిజన్ పరిసరాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో పరిశుభ్రత కోసం శ్రమదానం చేయాలన్న కార్పొరేటర్ పిలుపులో భాగంగా, ఆయనే స్వయంగా ముందుండి పాఠశాల ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛత కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ శ్రమదానంలో భాగంగా, పాఠశాల ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేసి, పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ "ప్రభుత్వ సంస్థలలో, పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించడం కేవలం సిబ్బంది బాధ్యత కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. ఈ శ్రమదానం ద్వారా పాఠశాల పరిసరాలు శుభ్రంగా, హరితంగా మారాయి. ఇలాంటి సామూహిక ప్రయత్నాలు ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంచుతాయి." భవిష్యత్తులో కూడా డివిజన్ పరిధిలో ఇలాంటి స్వచ్ఛత కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆఫ్ చైర్మన్ పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. మాధవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్, ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల బోధనేతర సిబ్బంది, ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఫొటో జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ సూద మల్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం జరిగిన ఆయన దశదిన కర్మ సందర్భంగా మిత్రులు, పూర్వ విద్యార్థుల బృందం ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించింది. శ్రీనివాస్ ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరకాల జడ్పీహెచ్ఎస్ స్కూల్ టెన్త్ పూర్వ విద్యార్థుల బృందం తరపున వారికి రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన రాజశేఖర్, శీను, అశోక్, కోడెపాక భాస్కర్, జన్ను రాజయ్య, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హైదరాబాద్‌లో జరగబోయే జూనియర్స్ అండర్-17 రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల కోసం హనుమకొండలోని ఐడియల్ స్కూల్ గ్రౌండ్స్‌లో తొమ్మిదవ ఉమ్మడి జిల్లా స్థాయి సెలక్షన్స్ శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా (హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగాం, ములుగు) నుంచి సుమారు 150 మంది బాల బాలికల క్రీడాకారులు ఈ సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు హనుమకొండ నుంచి పునీత్ కుమార్, బన్నీ, సాయి ప్రణీత్, అనుదీప్యవ్య, నవీన, అనుష్క, సపురా, వరంగల్ నుంచి సాయి తేజ, సోహెల్, కార్తీక్, ప్రీతంమానస, నిస్సి, జ్యోతి, సంధ్య, జనగాం నుంచి ప్రణయ్, రితీష్, అభిలాష్, పవన్యణ్యుఖ, శేష్మిక, పవిత్ర నంద, అక్షర, ములుగు నుంచి శమంత్, ఆకాష్, అస్ను, వశీకర్, మనిధర్మరణ్య, శ్రీజ, హర్షిత, సౌమ్యశ్రీ, మహబూబాబాద్ నుంచి గౌతమ్, శ్రీశాంత్, విగ్నేష్, సాంబసోహ, అరుబానాజ్, అక్షిత, లక్ష్మీ ప్రసన్న, భూపాలపల్లి నుంచి సందీప్, హేమంత్, అక్షిత్ రామ్షాజీమా దిల్షాద్, సాక్షిత, మీనాక్షి, ఝాన్సీ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులందరూ రాష్ట్రస్థాయి బాలబాలికల టెన్నికాయిట్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి టెన్నికాయిట్ రాష్ట్ర కోశాధికారి అల్వాల రాజకుమార్, వరంగల్ జిల్లా టెన్నికాయిట్ కార్యదర్శి గోకారపు శ్యాం కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి జహూర్ హాజరయ్యారు. అతిథులుగా ఐడియల్ స్కూల్ విద్యాసంస్థల యాజమాన్యం ఫిరోజుద్దీన్, సర్వరాజుద్దీన్, పీఈటీ పాషా, సీనియర్ టెన్నికాయిట్ క్రీడాకారులు పవన్, సాయి, కౌశిక్, అర్జున్, దేవేందర్, మధు వివిధ జిల్లాల పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

# బిర్సా ముండా యువతకు ఆదర్శం

## కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం



**వరంగల్ వాయిస్, కేయూ :** భారత స్వాతంత్ర్య పోరాట యోధుడు భగవాన్ బిర్సా ముండా ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ (కేయూ) రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. శనివారం ఉదయం విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో, విశ్వవిద్యాలయ ఎస్సీ/ఎస్టీ సెల్ సంచాలకులు డాక్టర్ ఎ.రాజు అధ్యక్షతన బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని "జన జాతీయ గౌరవ దివస్" కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా పాల్గొని, బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను, విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. బిర్సా ముండా అతి చిన్న వయస్సులోనే తన జాతి ప్రజల కోసం చేసిన త్యాగం మరువలేనిది అన్నారు. బ్రిటిష్ దురహంకారానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శం అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆంగ్ల భాషపై పట్టు, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై పట్టు సాధించడం అవసరం. సెల్ ఫోన్‌కు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, జ్ఞానం, తెలివితేటలు నిర్వీర్యం కావద్దు అన్నారు. జాగరూకతతో ఉండి, కష్టపడే తత్త్వం పెంపొందించుకోవాలని సూచించారు. యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా జాతి మనుగడ కోసం చేసిన పోరాట స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ సారయ్య దొర మాట్లాడుతూ, ఆదివాసుల రక్షణకు, వారి భూముల రక్షణకు చాల చట్టాలు వచ్చాయని, వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఆదివాసులలో నిర్లిప్తత ఉంది అన్నారు. ఎస్సీ/ఎస్టీ ఉద్యోగ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, బిర్సా ముండా ఆదివాసుల సంస్కృతి, హక్కులను కాపాడే క్రమంలో ఎంతో మందిని చైతన్యపరిచి, ప్రభావితం చేశాడని, నాగరిక జీవన విధానానికి విరుద్ధంగా ప్రాణ త్యాగం చేశాడు అన్నారు. ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీ రాజు సంయోజకులుగా వ్యవహరించారు.

# పెండింగ్ బకాయిల కోసం 17న మహా ధర్నా

## ◆ రిటైర్డ్ పెన్షనర్లకు శ్రీధర్ల ధర్మేంద్ర పిలుపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రిటైర్ అయిన ఉద్యోగుల పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు శ్రీధర్ల ధర్మేంద్ర పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆయన, ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కందుకూరి దేవదాసుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మార్చి 2024 నుంచి నవంబర్ 2025 వరకు రిటైర్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రిటైర్మెంట్ బకాయిలను 20 నెలలు గడిచినా చెల్లించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్లను మానసికంగా వేధించడమేనని, తీవ్ర అనారోగ్యానికి గురిచేయడం ప్రభుత్వానికి సరియైనది కాదని డిమాండ్ చేశారు. బకాయిలు అందక రిటైర్డ్ ఉద్యోగులు చాలామంది మానసిక వేదనతో చనిపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపుగా 26 మంది రిటైర్డ్ పెన్షనర్లు బకాయిలు రాకపోవడంతో బాధతో కృంగిపోయి, ఆరోగ్యం క్షీణించి చనిపోయారని




తెలిపారు. రిటైర్మెంట్ బకాయిలు రాక పెన్షనర్లు పిల్లల పెండ్లి చేయలేక, ఇల్లు కట్టుకోలేక, చేసిన అప్పులు తీర్చలేక, బ్యాంక్ ఈ.ఎం.ఐ.లు చెల్లించలేక, వృద్ధ తల్లిదండ్రులను చూసుకోలేక నానా ఇబ్బందులకు గురవుతున్నారని, తమ ఆరోగ్యాన్ని బాగు చేసుకోలేని దయనీయమైన స్థితిలో ఉన్నారని వివరించారు. గతంలో ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞాపన పత్రాలు సమర్పించినప్పటికీ స్పందన రాకపోవడంతోనే ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రిటైర్ అయిన 13,000 కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. 17న హైదరాబాద్ ఇందిరా పార్కులో జరిగే ధర్నాకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎండీ అబ్దుల్ గఫార్, ఇ ఇంద్రసేనారెడ్డి, పి.సంజీవరెడ్డి, కె.సారయ్య, డాక్టర్ బి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# ఢిల్లీపై పోరాడాల్సిందే



## ◆ బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం తేల్చుకోవాలి

**వరంగల్ వాయిస్, కేయూ :** రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ధర్మ యుద్ధం చేస్తున్నామని, బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడితే బీసీల తిరుగుబాటు తప్పదని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీ (కేయూ)లోని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న బీసీల ధర్మ పోరాట దీక్షల ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలు డిమాండ్లు చేశారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించేందుకు డిసెంబర్ 1వ తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానితో భేటీ కావాలి. ప్రధాని సమయం ఇవ్వకపోతే, ఇండియా కూటమి తరపున పార్లమెంటు సమావేశాలను స్తంభింపచేయాలి. పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ కేంద్రంపై పోరాడడానికి రాజకీయ కార్యాచరణ ప్రకటించాలి. "బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీతో కొట్లాడుతారో, బీసీలకు ద్రోహులుగా నిలబడతారో కాంగ్రెస్ ప్రభుత్వం తేల్చుకోవాలి. బీసీలను నమ్మించి మోసం చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు." జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా వచ్చాయని భావించి, డిసెంబర్ 17న జరిగే క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. "బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించకుండా స్థానిక ఎన్నికలకు వెళితే బీసీలు రాష్ట్రంలో అగ్ని రాజేస్తాం. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలతో స్థానిక ఎన్నికలకు వెళితే కాంగ్రెస్ ను బీసీలు ఎప్పటికీ నమ్మరు." బీసీ ప్రధానిగా నరేంద్ర మోదీ గత 11 సంవత్సరాలుగా పరిపాలిస్తున్నప్పటికీ బీసీల డిమాండ్లను నెరవేర్చకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే డిసెంబరులో జరిగే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. బీజేపీ బీసీ వ్యతిరేక వైఖరి విడనాడకపోతే, వచ్చే ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలే పునరావృత్తం అవుతాయని హెచ్చరించారు. డిసెంబర్ మొదటి వారంలో వేలాది మందితో పార్లమెంటును దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. రేపు 'రన్ ఫర్ సోషలిసిస్' పేరుతో ర్యాలీలు తీస్తామని తెలిపారు. "42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదు. గల్లీలో తెలంగాణ ఉద్యమ తరహాలో, ఢిల్లీలో రైతు ఉద్యమ తరహాలో బీసీలు ఉద్యమించి విజయం సాధిస్తారు." ఈ దీక్ష ముగింపు కార్యక్రమంలోబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ, బీసీ జేఏసీ నాయకులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, డా.సంగాని మల్లేశ్వర్, డా.చిర్ర రాజు గౌడ్, బోనగాని యాదగిరి గౌడ్, వరంగల్ శ్రీనివాస్, భీమగాని యాదగిరి, మాదం పద్మజ దేవి, తమ్మేలా శోభరాణి, వేముల మహేందర్, ద్యాగాల శ్రీనివాస్, అజయ్ సింగ్, అన్వేష్ , రాజశేఖర్,కాగితపు నాగరాజు,అనిల్, సుమన్ రాజ్, నితిన్,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఆక్రోశ సభకు తరలిన నాయకులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన డిమాండ్‌తో కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం జరగబోయే బీసీ ఆక్రోశ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, ధర్మ స్వరాజ్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని, వాటిని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ ఈ సభను ఏర్పాటు చేశారు. జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్ (చీఫ్ జస్టిస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్), చిరంజీవులు ఐఏఎస్ రిటైర్డ్ (బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర చైర్మన్), డా.విశారదన్ మహరాజ్ (బీసీ ఎస్సీ ఎస్టీ - జేఏసీ రాష్ట్ర కన్వీనర్), బాలరాజు గౌడ్ (బీసీ పొలిటికల్ ఫ్రంట్ స్టేట్ ప్రెసిడెంట్) పిలుపు మేరకు వరంగల్ నుంచి నాయకులు బయలుదేరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం నుంచి, ప్రతి మండల కేంద్రం నుంచి రెండు, మూడు కార్ల చొప్పున, అదేవిధంగా వివిధ ప్రైవేటు బస్సుల ద్వారా దాదాపుగా 500 మందికి పైగా నాయకులు, ఉద్యోగులు, విద్యావంతులు, మహిళలు, విద్యార్థులు తమ సొంత వాహనాల్లో స్వచ్ఛందంగా కామారెడ్డికి బయలుదేరారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికలలో సాధించుకోవాలనే లక్ష్యంతో ఈ సభ జరుగుతోందని డాక్టర్



చందా మల్లయ్య పద్మశాలి (బీసీ ఎస్సీ ఎస్టీ-జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్), డాక్టర్ కూరపాటి రమేష్ (రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం కార్యదర్శి) సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ ఎస్సీ ఎస్టీ కోఆర్డినేటర్ మేకల సుమన్, డాక్టర్ కె.వీరస్వామి (ఇంటలెక్చువల్ ఫోరం చీఫ్ కోఆర్డినేటర్), ఇస్లావత్ మోహన్ నాయక్ (సేవాలాల్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షులు), మూడు వీరన్న నాయక్, గుగులోతు రాజన్న నాయక్, గొల్లపల్లి సురేష్ గౌడ్, శ్రీ బాబు యాదవ్, మాటేటి బాలకృష్ణ, కిరణ్ పద్మశాలి, సిలువేరు రవి (ఎంజేఏస్ జిల్లా అధ్యక్షులు), కట్కూరి సునీల్, కెమ్ సత్తి నాగరాజు, రొద్ద మురళీకృష్ణ, దామెర శ్రావణ్, ఇల్లందుల సుమన్, జన్ను కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# పీరియాడిక్ డ్రామా.. కాంత

దుల్కర్ సల్మాన్, రానా.. ఇద్దరూ సినిమా అంటే ప్రత్యేకమైన అభిరుచి వున్న నటులు. ఈ ఇద్దరూ కలసి నటిస్తూ నిర్మించిన సినిమాగా అందరి దృష్టిని ఆకర్షించింది 'కాంత'. ఇదొక పీరియాడిక్ డ్రామా. ఈ కథకు సంబంధించి తమిళనాడులో వివాదాలు కూడా చోటు చేసుకున్నాయి. అయితే సినిమా టీం మాత్రం ఇది ఎవరి బియోపిక్ కాదు.. ఫిక్షనల్ స్టోరీని చెప్పింది. మరి బియోపిక్ లా అనిపించిన ఆ ఫిక్షనల్ కథ ఏమిటి ? దుల్కర్, రానా కలసి చేసిన ఈ ప్రయత్నం ప్రేక్షకులని అలరించిందా? రివ్యూలో చూద్దాం.

**కథ విషయానికి వస్తే..**

అయ్య (సముద్రఖని) పేరు ప్రఖ్యాతలున్న దర్శకుడు. తన తల్లి శాంత కథని సినిమాగా తీయాలనుకుంటాడు. తన శిష్యుడైన మహదేవన్ (దుల్కర్ సల్మాన్) అందులో హీరో. మహదేవన్ కు స్టార్ ఇమేజ్ తీసుకొచ్చింది అయ్యనే. కానీ ఇద్దరి మధ్య ఈగో క్లాష్ తో దూరం పెరుగుతుంది. కొన్ని కారణాల వలన ఆగిపోయిన 'శాంత' మళ్ళీ పట్టాలెక్కుతుంది. అయితే ఈసారి తను చెప్పిన క్లైమాక్స్‌తోనే సినిమాని తీయాలనే కండీషన్ పెడతాడు మహదేవన్. అంతేకాదు శాంతని `కాంత`గా మార్చేస్తాడు. కథానాయికగా కుమారి (భాగ్యశ్రీ బోర్సే) ప్రాజెక్ట్ లోకి వస్తోంది. కుమారి, మహదేవన్ మధ్య ప్రేమ చిరుగిస్తుంది. ఈగో క్లాష్ తో సాగుతున్న సినిమాకి మరో సమస్య వచ్చిపడుతుంది. సినిమా యూనిట్ లో ఒకరు హత్యకు గురవుతారు. ఆ హంతకుడిని కనిపెట్టేందుకు ఇన్‌స్పెక్టర్ దేవరాజ్ (రానా దగ్గుబాటి) రంగంలోకి దిగుతాడు. తర్వాత ఏం జరిగింది? హత్య చేసింది ఎవరు? అయ్యా, మహదేవ్ ఈగో కి కారణం ఏమిటి? చివరి కాంతకి ఎలాంటి క్లైమాక్స్ దొరికుందనేది తెరపై చూడాలి.

సినీ రంగంలో ఉద్దండులైన దర్శక, హీరో మధ్య నెలకొన్న ఈగో క్లాష్ కాన్ఫ్లిక్ట్ తో నడిచే కథ ఇది. ఈ కాన్ఫ్లిక్ట్ కి ఒక మర్డర్ మిస్టరీ తోడు కావడం, అలాగే 1950 నేపధ్యం కావడంతో తెరపై చూస్తున్నప్పుడు ఒక కొత్త అనుభూతి కలిగించింది. సినిమా మొదలైన ఐదు నిమిషాల్లోనే అలనాటి సినీ ప్రపంచంలో ప్రేక్షకుడు లీనమైపోతాడు. ప్రథమార్ధం సినిమాలో సినిమా చుట్టూ నడిచే సన్నివేశాలు నిజంగా సినిమాని ఫిల్మ్ మేకింగ్ ని ఇష్టపడే ప్రేక్షకులకు మరింతగా నచ్చుతాయి. మర్డర్ తో కథ కొత్త మలుపు తిరుగుతుంది.సెకండ్ హాఫ్ హత్య కేసు పరిశోధన చుట్టూనే సాగుతుంది. సడన్ తీసుకున్న ఈ టర్న్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ ఫీలింగ్ కలిగిస్తుంది. రానా పాత్ర ప్రవేశం ఆసక్తిని పెచుతుంది. కాకపోతే ఇన్వెస్టిగేషన్ కాస్త లాగ్ అనిపిస్తుంది. అయితే క్లైమాక్స్ సినిమాకి ఆయువు పట్టుగా నిలిచింది. అక్కడ పండిన డ్రామా, దుల్కర్ నటన నెక్స్ట్ లెవల్ లో వుంటుంది.


ఈ సినిమాకి బలం కథ కథనం అనడం కంటే నటీనటులు అద్భుతమైన ప్రదర్శన కారణంగా నిలబడిన సినిమా ఇది. నిజంగా దుల్కర్ తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. తన లుక్, పెర్ఫార్మెన్స్, డైలాగ్ డిక్షన్, ముఖ్యంగా క్లోజప్పుల్లో తన ఎక్స్ ప్రెషన్స్ 'వావ్' అనిపించేలా వుంటాయి. నటిగా భాగ్యశ్రీకి ఫుల్ మార్కులు పడిపోతాయి. అలనాటి తార పాత్రలో పరకాయప్రవేశం చేసింది. సముద్రఖని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దుల్కర్, సముద్రఖని పోటీపడి నటించారు. రానా పాత్ర కూడా చక్కగా కుదిరింది. నిజానికి ఇందులో ఇన్వెస్టిగేషన్ కొత్తగా వుండదు. కానీ రానా ప్రజెన్స్ రొటీన్ ని కూడా ఇంటెన్స్ గా ఫీల్ అయ్యేలా చేసింది. సంగీతం, కెమరా వర్క్ ఈ సినిమాకి మరో పెద్ద ఎసెట్. దాని విజువల్స్ ఒక గోల్డెన్ ఏజ్ సినిమా చూస్తున్న అనుభూతిని కలిగించాయి. ఆర్ట్ వర్క్ చక్కగా కుదిరింది. సినిమా, సినిమా నిర్మాణం, వింటేజ్ సినిమాపై ఇష్టం వున్న ఆడియన్స్ కి కాంత మరింతగా కనెక్ట్ అవుతుంది.

ఇక సినిమా ప్లస్ పాయింట్స్ విషయానికి వస్తే దుల్కర్, రానా, భాగ్యశ్రీ, సుముద్రఖని నటన కథా నేపధ్యం, మ్యూజిక్ విజువల్స్ బాగున్నాయని చెప్పవచ్చు.

సెకండ్ హాఫ్ లో కాస్త లాగ్ అనిపించడం








# పాస్ పోర్ట్ తీసుకోవడం తప్పనిసరి..

'బాహుబలి', 'RRR' వంటి పాన్ వరల్డ్ సెన్సేషన్స్ తర్వాత దర్శకుడు ఎస్. ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న మూవీ 'Globe Trotter'. మహేష్ హీరోగా నటిస్తున్న ఈ మూవీలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ టైటిల్ రివీల్ చేసేందుకు నవంబర్ 15న హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో Globe Trotter ఈవెంట్ జరగనుంది. ఈ ఈవెంట్‌కి సంబంధించి, దాదాపు 1 లక్ష పాస్‌లు విక్రయించబోతున్నట్టు సమాచారం...

40 వేల మందికి సిట్టింగ్ ఏర్పాట్లు జరగగా మిగిలిన 60 వేల మంది అభిమానులు నిలబడే ఈ ఈవెంట్ చూడబోతున్నారు. ఈ ఈవెంట్‌కి ఎలా రావాలో, ఎటు వైపు రావాలో కూడా డైరెక్టర్ ఎస్. ఎస్. రాజమౌళి వీడియో ద్వారా వివరించాడు. సాధ్యమైనంత వరకూ ఎక్కువ మంది కలిసి ఒకే వాహనంలో వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా హీరో మహేష్ బాబు అభిమానులను కోరాడు..

ఈ ఈవెంట్‌కి రావాలంటే పాస్ పోర్ట్ తీసుకోవడం తప్పనిసరి..

పాస్ పోర్ట్ తీసుకోవడానికి గూగుల్‌లో ఓ ఫామ్‌ని నింపాల్సి ఉంటుంది. ఈ ఫామ్ లింక్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. దాన్ని నింపిన తర్వాత మీ పేరుతో ఓ ఐడీ జనరేట్ అవుతుంది. దాన్ని తీసుకుని, పాస్ పోర్ట్ ఎక్కడ దొరుకుతుందో అక్కడికి నేరుగా వెళ్లి, కలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది.

అయితే పాస్ పోర్ట్ జారీ చేసేందుకు అప్లికేషన్లు ఓపెన్ అయిన కొన్ని నిమిషాల్లో లక్షల్లో అప్లికేషన్లు వచ్చాయి. దీంతో ప్రస్తుతానికి ఈ వెబ్‌సైట్ నుంచి కొత్త అప్లికేషన్లు తీసుకోవడం లేదు...

**వరుస సంఘటనలు..**

గత ఏడాది కాలంలో జరిగిన అనేక సంఘటనలు, ఫ్యాన్స్‌ని భయాందోళనలకు గురి చేస్తున్నాయి. 'పుష్ప 2' ప్రీమియర్స్ సమయంలో తొక్కిసలాట దగ్గర్నుంచి మహా కుంభమేళాలో, తిరుపతిలో, కాశీబుగ్గ శ్రీవెంకటేశ్వర ఆలయంలో, కరూర్ పొలిటికల్ బహిరంగ సభలో.. ఇలా జనాలు భారీగా తరలివచ్చిన ప్రతీ చోటా తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో జనాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ వరుస సంఘటనల కారణంగానే 'globe trotter' ఈవెంట్‌కి వచ్చే అభిమానుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది పోలీస్ శాఖ.. ముందుజాగ్రత్తగా అభిమానులను హెచ్చరిస్తూ డైరెక్టర్ రాజమౌళి, హీరో మహేష్ కూడా వీడియో సందేశం ఇచ్చారు... ఈ ఈవెంట్‌కి తెలుగు యాంకర్ సుమతో పాటు హిందీ యూట్యూబర్ ఆశిష్ చంచ్‌లానీ హోస్ట్ చేయబోతున్నారు.

# ఫైట్స్ చేస్తున్న మన శంకర వర ప్రసాద్‌గారు

చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది. ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ వల్ల షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల `విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



# వయోవృద్ధులను గౌరవిద్దాం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వయోవృద్ధులను గౌరవిద్దాం – వారి అనుభవాల్ని స్వీకరిద్దామని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తా నుంచి పోస్ట్ ఆఫీస్ సర్కిల్ వరకు వయోవృద్ధుల వాకతాన్ (ర్యాలీ) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా హాజరై , జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాచీన కాలం నుంచి వయోవృద్ధులను గౌరవించడం మన సంస్కృతి అన్నారు. వారి పట్ల ప్రతి ఒక్కరూ మర్యాదగా ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో వయోవృద్ధుల ప్రాముఖ్యం చాలా గొప్పదని, వారు దిశా నిర్దేశకులన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి.రాజమణి మాట్లాడుతూ, వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామన్నారు. వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారి బాధ్యతల్ని గుర్తుచేస్తున్నామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, టోల్ ఫ్రీ నెంబర్ 14567 గురించి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి.రాజమణి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డీఈవో రంగయ్య నాయుడు, సీడీపీఓలు విద్య, మధురిమ, దెబోరా, సూపర్వైజర్లు, డీసీపీఓ ఉమా, సఖి అడ్మిన్ శ్రీలత, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా వయోవృద్ధుల కమిటీ మెంబర్స్ మల్లారెడ్డి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ వీర ఉపేందర్, టీచర్స్, సిబ్బంది, సుమారు 150 మంది విద్యార్థులు, జిల్లాలోని పలు ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు, వయోవృద్ధుల అసోసియేషన్ మెంబర్స్, వయోవృద్ధులు మొత్తం 250 మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ..

నల్లబెల్లి మండలం గోవిందాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ధాన్యాన్ని తొందరగా తూకం వేసి రైస్ మిల్లులకు పంపాలన్నారు. రైతులు తమ ధాన్యంపై టార్పాలిన్ కవర్స్ కప్పే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాబ్ లో రైతుల వివరాలు నమోదు చేసి వారి అకౌంట్ లలో తొందరగా డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఏఓ అనురాధ, డీఎం సివిల్ సప్లైస్ సంధ్యారాణి, డీఎస్ఓ కిష్టయ్య, తహసీల్దార్ పాల్గొన్నారు.



# జానపద గిరిజన విజ్ఞానపీఠాన్ని అభివృద్ధి చేస్తా

□ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**వరంగల్ వాయిస్, హంటర్ రోడ్ :** జానపదులు, గిరిజనులపై చేసిన పరిశోధన అమూల్యమైనదని, సమాజానికి, విద్యార్థులకు విలువైన సమాచారం అందించేలా జానపద గిరిజన విజ్ఞానపీఠం చేస్తున్న కృషి అభినందనీయమని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. ఈ మేరకు వరంగల్ హంటర్ రోడ్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠాన్ని శనివారం ఆయన సందర్శించారు. పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గత అక్టోబర్‌లో వచ్చిన వరదలలో నీటిలో మునిగిన విశ్వవిద్యాలయ భవనంలోని మ్యూజియంను వీసీ సందర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలువైన పురాతన వస్తువులు, కళారూపాలు పాడైపోవడం బాధాకరమన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా మ్యూజియం ప్రత్యేక నిర్మాణం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జానపద గిరిజన విజ్ఞానపీఠాన్ని అభివృద్ధి చేయడంలో సహకరిస్తానని, ఆ దిశగా పరిశోధనలకు, పుస్తకాల ప్రచురణకు, కొత్త కోర్సుల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, బాసాని సురేష్, డాక్టర్ చూరేపల్లి రవి కుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, డాక్టర్ నోముల రాజు, డాక్టర్ సునీత, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, బుక్ బెరర్ సిద్దోజు సునంద, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయిలో చిన్నారి ప్రతిభ

□ ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న ఇషాన్వి గౌడ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పట్టణానికి చెందిన ఓ చిన్నారి అతి చిన్న వయసులోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అందరికీ ఆదర్శంగా నిలిచింది. నవంబర్ 14న (చిల్డ్రన్స్ డే) సందర్భంగా హైదరాబాద్‌లోని ఫిలిం కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల కోసం వివిధ రంగాలలో నిర్వహించిన పోటీల్లో హనుమకొండ పట్టణానికి చెందిన డాక్టర్ భీమగాని స్పందన – డాక్టర్ భీమగాని గోపీచంద్ దంపతుల గారాలపట్టి భీమగాని ఇషాన్వి గౌడ్ (4) నర్సరీ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇషాన్వి గౌడ్ దేశంలోని రాష్ట్రాల పేర్లు, రాష్ట్ర రాజధానుల పేర్లను ధారాళంగా చెప్తుంటే, కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు ఆమె టాలెంట్‌ను చూసి మంత్రముగ్ధులయ్యారు. అంతేకాకుండా, ఆమె వివిధ రంగాలలో రాణిస్తూ, ప్రముఖులచే సన్మానం పొందడం, వారి ఆశీర్వాదం తీసుకోవడంతో అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఆ చిన్నారి తాతగారైన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్ ఈ సందర్భంగా గర్వాన్ని వ్యక్తం చేశారు. తన మనవరాలు రాష్ట్ర స్థాయిలో రాణించి ప్రథమ బహుమతి పొందడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని ఆనందాన్ని వెలిబుచ్చారు. ఇషాన్వి గౌడ్ తల్లిదండ్రులు డాక్టర్ వృత్తిలో ఉండి కూడా తమ కూతురు కెరీర్ పట్ల ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో అర్థం చేసుకోవాలని మేధావులు అభిప్రాయపడ్డారు. ప్రతి విద్యార్థి యొక్క తల్లిదండ్రులు వారి పిల్లల కెరీర్ పట్ల చిన్నప్పటి నుంచే శ్రద్ధ తీసుకుంటే ఇలాంటి ఆణిముత్యాలను ఎందరినో వెలికి తీయవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఇషాన్వి గౌడ్ తల్లిదండ్రులకు పలువురు అభినందనలు తెలిపారు.

# ఏవీవీలో భాగవత పద్య పఠన పోటీలు

- వీనుల విందుగా సాగిన కార్యక్రమం
- పాల్గొన్న 1,600 విద్యార్థులు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఏవీవీ జూనియర్ కళాశాలలో శనివారం పాఠశాల స్థాయి విద్యార్థులకు పోతన భాగవత పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఆనందోత్సవాల నడుమ, వీనుల విందుగా జరిగిన ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ఆచార్య ఎస్ఎస్ విఎన్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బాల్యంలో 50 పోతన పద్యాలను కంఠస్తం చేసి అప్ప చెప్పే వారమన్నారు. ప్రతి వ్యక్తి చిన్నప్పటినుంచే భక్తి, జ్ఞానం కలిగి ఉంటే భవిష్యత్ ఆనందంగా సాగుతోందన్నారు. దానికి పోతన భాగవతం ఎంతో తోడ్పడుతుందన్నారు. కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్ కుమార్ మాట్లాడుతూ గత 80 సంవత్సరాల నుంచి ఏవీవీ ప్రాంగణంలో ఆచార్య చందా కాంతయ్య శ్రేష్టి ఆలోచనకు అనుగుణంగా ఈ పద్య పఠణ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఎంతోమంది విద్యార్థుల్లో భక్తిని కలిగిస్తూ విద్యార్థులు మంచి మార్గంలో నడుచుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో మనం గౌరవంగా బతకాలంటే భాగవతం చదవాలన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.భుజేందర్ రెడ్డి మాట్లాడుతూ భాగవత పద్యాలు నేర్చుకొని అందులో భావాన్ని గ్రహించి మీరంతా మంచి విద్యార్థులుగా అభివృద్ధి చెందాలన్నారు. నిర్వాహకులు గందె శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సంవత్సరం దక్షయజ్ఞం నుంచి మీకు పద్యములు ఇచ్చామని వాటిని బాగా చదివి మీరు భగవంతుని కృపకు పాత్రులు కావాలన్నారు. ఈ పోటీ కార్యక్రమంలో 34 పాఠశాలల నుంచి 1600 మంది విద్యార్థులు పాల్గొని ఏవీవీ ప్రాంగణమును పవిత్రమొనర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు, పాలకవర్గ శాశ్వతసభ్యులు చందా శ్రీకాంత్, ఏవీవీ విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, న్యాయ నిర్ణేతలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com